క్లుప్తంగా

శాస్త్రోక్తంగా పల్లకిసేవ



ఇందుకూరుపేట: మండలంలోని కొమరిక గ్రామంలో కొలువైన మొలక పోలేరమ్మకు సోమవారం రాత్రి పల్లకిసేవ శాస్త్రోక్తంగా జరిపారు. ఉదయం ఆలయ అర్చకుడు శాస్త్రి ఆధ్వర్యంలో 11 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, కుంకుమార్చన, శ్రీచక్ర పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



పొదలకూరు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎమ్మార్సీ ప్రాంగణంలో న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఎంఈఓలు రేణుక, శోభాద్రి ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల హ్యాండ్‌బుక్, టేబుల్ క్యాలెండర్స్‌ను కూడా ఈ సందర్భంగా విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు మాల్యాద్రిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్లు సునీల్ కుమార్, ఎస్కే సుభాన్, కాంతారావు, జనార్దన్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రూరల్ అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి



మనోహర్‌రెడ్డిని అభినందిస్తున్న పార్టీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం: బీజేపీ బుచ్చి రూరల్ మండలాధ్యక్షుడిగా సిద్దన మనోహర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన్ను సత్కరించారు. పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

మనుబోలు: మనుబోలు సమీపంలోని కండలేరు ఒడ్డున ఉన్న కామాక్షితాయి సమేత సంగమేశ్వరాలయంలో సోమవారం సోమావతి అమావాస్య పూజలను అర్చకుడు సాయికుమార్‌శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. బృంగి మధుసూదన్ – మీనాక్షి దంతపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

– **పొదలకూరు :** పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కోవూరు కవికి సత్కారం



కోవూరు : మండలంలోని చిన పడుగుపాడుకు చెందిన యువకవి కోటపూరి ప్రేమ్‌సాగర్‌కు తెలుగు మహాసభల్లో సోమవారం ఆత్మీయ సత్కారం లభించింది. విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో 'ప్రకృతిని ప్రేమిద్దాం.. స్పృహ కలిగి జీవిద్దాం' అనే శీర్షికతో ఆయన చదివిన కవిత విశేషంగా అలరించింది. దీంతో ప్రేమ్‌సాగర్‌ను పలువురు అతిథులు సత్కరించారు.

రూ.లక్ష ఆర్థిక సాయం



ఇందుకూరుపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇబ్బందులు పడుతున్న వ్యక్తికి చికిత్స నిమిత్తం ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన(ఏపీపీవైఎస్) లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఇందుకూరుపేట మండలం నర్సాపురం గ్రామానికి చెందిన అడిగోపుల సుధీర్ కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఆయన కూడా తీవ్రంగా గాయపడ్డాడు. దీనివల్ల పోషణ కూడా పెనుభారంగా మారింది. దీంతో ఏపీపీవైఎస్ తన వంతుగా రూ.లక్ష నగదును ఆర్థిక సాయంగా బాధితుడికి సోమవారం స్వగ్రామంలో అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి గోలీ వంశీకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునగపాటి రమే ష్, జిల్లా ప్రతినిధులు వెంకటేశ్వర్లు, వాసుదేవరావు, దయాకర్, మదన్ పాల్గొన్నారు.

జొన్నవాడలో ప్రత్యేక ఏర్పాట్లు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూలైన్లు పెట్టామన్నారు. తాగునీటి సౌకర్యం కలిపించామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు పోలీసు బందోబస్తు ఉంటుందని తెలియజేశారు.

అంతా గందరగోళం

- గోదాముల్లో ఈ – పోస్ విషయంలో అస్పష్టత
- డీలర్ బయోమెట్రిక్ వేయాల్సిందే అంటున్న అధికారులు
- అయితే హాజరు కాని కొందరు డీలర్లు
- ఇది సాధ్యం కాదని వారి వాదన



పొదలకూరు ఎంఎల్ఎస్ గోదాము



బియ్యం బస్తాలు (ఫైల్)

పొదలకూరు: పౌరసరఫరాల శాఖకు సంబంధించి మండల లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్లలో ఈ – పోస్ వినియోగంపై గందరగోళం నెలకొంది. అటు అధికారులు, ఇటు రేషన్ షాపుల డీలర్లు తమకు తోచిన విధంగా చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గోదాముల నుంచి రేషన్ షాపులకు బియ్యం, సరుకులను రవాణా చేసే విషయంలో నిబంధనలను మార్చింది. దీంతో ఇబ్బందులు పడుతున్నామని డీలర్లు అంటుండగా ఉన్నత, పౌరసరఫరా సంస్థ అధికారులు మాత్రం కచ్చితంగా నిబంధనలను పాటించాల్సిందేనని పేర్కొంటున్నారు. ఫలితంగా ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద స్టాక్ వివరాలను వెల్లడించడంలో స్పష్టత లేకుండా పోతోందని తెలుస్తోంది. అంతేకాక డీలర్లకు బియ్యం, సరుకులను ట్రాక్టర్లలో చేర్చడమేమిటని, లారీల్లో పంపాలనే నిబంధనలను పాయింట్ అధికారులు అతిక్రమిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి చెబుతున్నారు. రెండురోజుల క్రితం ఆయన పొదలకూరు పాయింట్‌ను తనిఖీ చేశారు. ఈ – పోస్ విధానం, బియ్యం, సరుకుల రవాణా తదితర అంశాలపై అసంతృప్తి వ్యక్తం చేసి డీఎస్ఓ కార్యాలయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అయితే ఆయన జిల్లాలో ఏ ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్లినా దాదాపుగా ఇలాంటి పరిస్థితే ఉన్నట్టు తెలుస్తోంది.

అసలేం జరుగుతోంది?

పొదలకూరు గోదాము నుంచి చేజర్ల, మనుబోలు, పొదలకూరు మండలాల్లోని 123 షాపులకు ప్రతి నెలా పీడీఎస్ బియ్యం, సరుకులను అందజేస్తున్నారు. నెలలో స్టాక్ పాయింట్‌కు సరాసరి బియ్యం 600 టన్నులు, కందిపప్పు 50 టన్నులు, పంచదార 50 టన్నులు దిగుమతి అవుతుంది. అయితే సంబంధిత డీలర్ వచ్చి ఈ – పోస్‌లో బయోమెట్రిక్ వేసి సరుకుల వివరాలను ఫీడ్ చేయాల్సి ఉంటుంది. దాదాపుగా 95 శాతం ఈ పద్ధతిని పాటించడం లేదు. దీంతో స్టాక్ పాయింట్ నుంచి ఏ మేరకు సరుకులు డీలర్లకు చేరాయో ఆన్‌లైన్‌లో పరిశీలించేందుకు అవకాశం ఉండదు. ఇదే అంశంపై ఏపీ పౌరసరఫరా సంస్థ డైరెక్టర్ స్టాక్ పాయింట్ ఇన్‌చార్జిని ప్రశ్నించారు. బియ్యం, సరుకులను ట్రాక్టర్లలో రవాణా చేసేందుకు నిబంధనలు లేవు. లారీల్లోనే గ్రామాలకు చేరవేయాల్సి ఉంటుంది.

డీలర్ల అవస్థలు

గోదాము వద్ద ఈ – పోస్‌లో బయోమెట్రిక్ విధానంలో బియ్యం, సరుకులను తీసుకెళ్లేందుకు అవస్థలు పడుతున్నట్లు డీలర్లు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో సరుకులన్నీ షాపులకు చేరిన తర్వాత ఆఖరులో వేలిముద్ర వేయడం వల్ల ఇబ్బందులు తలెత్తేవి కాదంటున్నారు. అయితే నేడు ప్రతిసారి ఈ – పోస్‌లో బయోమెట్రిక్ వేయాల్సి ఉంటున్నందునే సక్రమంగా హాజరు కాలేకపోతున్నట్టు చెప్పుకొస్తున్నారు. పౌరసరఫరా సంస్థ బియ్యం, సరుకులను ఏకకాలంలో సరఫరా చేస్తే తాము గోదాము వద్దకు వచ్చి వేలిముద్ర వేసి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. రేషన్‌కార్డులు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీలకు బియ్యం ఒక సమయంలో, సరుకులు మరో సమయంలో దిగుమతి అవుతున్నందున నెల పొడవునా గోదాము వద్దకు వెళ్లి ఈ – పోస్‌లో వేలిముద్ర వేయాల్సి ఉంటుందని ఇందువల్ల దూరప్రాంతాల నుంచి డీలర్లు హాజరు కావాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నట్టు తెలుస్తోంది. ఇరుకు వీధుల్లో లారీల్లో బియ్యం రవాణా చేయాలంటే కష్టంగా ఉంటుందని ట్రాక్టర్లలో తరలిస్తున్నట్లు సమాచారం.

డీలర్లు రావడం లేదు

> ఎంఎల్ఎస్ పాయింట్‌కు డీలర్లు వచ్చి ఈ – పోస్‌లో వేలిముద్ర వేస్తేనే స్టాక్ పంపాల్సి ఉంటుంది. అయితే కొందరు సక్రమంగా రావడం లేదు. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇదే విషయాన్ని తహసీల్దార్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. ఈ – పోస్ విధానాన్ని కఠినంగా అమలు చేసేందుకు కృషి చేస్తాం.
>
> – లక్ష్మీనారాయణరెడ్డి, గోదాము ఇన్‌చార్జి, పొదలకూరు

బాలికల ఉన్నత పాఠశాలలో సర్వే

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం సర్వే జరిగింది. కొందరు వ్యక్తులు ప్రహరీ ఉన్న స్థలం తమదని ఇటీవల కూల్చేసిన విషయం తెలిసిందే. దీనిపై హెచ్ఎం ఫెర్సిస్ రాతపూర్వక ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. స్థలం ఎవరికి చెందిందో తేల్చేందుకు స్థలాన్ని సమగ్రంగా సర్వే చేయాల్సిందిగా కోరినట్టు తెలుస్తోంది. దీంతో మండల సర్వేయర్ పర్యవేక్షణలో సర్వే చేసి గుర్తులు పెడుతుండగా స్థానికులు అక్కడికి చేరుకున్నారు. పత్రాలు పరిశీలించకుండా గుర్తులెలా పెడతారని నిలదీశారు. పాఠశాలకు చెందిన స్థలం కొలతలు వేసే సమయంలో హెచ్ఎం తప్పనిసరిగా ఉండాలని డిమాండ్ చేశారు. సర్వే చేస్తున్న వారు హెచ్ఎం , ఉపాధ్యాయులున్న సమయంలోనే ప్రక్రియను నిర్వహిస్తామని వెల్లడించారు. ఇదిలా ఉండగా హెచ్ఎం, టీచర్లు కలెక్టరేట్, జెడ్పీ సీఈఓ వద్దకు వెళ్లి పాఠశాల స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు తమదిగా చెప్పుకొంటూ గోడను కూల్చారని దీనిపై సమగ్ర విచారణ చేపట్టాల్సిందిగా వినతిపత్రాన్ని సమర్పించారు. పాత రికార్డులకు సంబంధించిన ఫైల్‌ను అందజేశారు. రెండు వారాల్లో స్థలం ఎవరిదనే విషయాన్ని సర్వే చేయిస్తామని జిల్లాస్థాయి అధికారులు వెల్లడించినట్టు హెచ్ఎం పేర్కొన్నారు.

సీపీఎం నాయకుల ర్యాలీ

ముత్తుకూరు: సీపీఎం నాయకులు సోమవారం ముత్తుకూరులో ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ మండల కార్యదర్శి తుంగా ఏడుకొండలు ఆధ్వర్యంలో ప్రధాన రోడ్డులో కార్యక్రమం జరిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరిచేలా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడారని, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు క్షేత్ర అధ్యయనం అవసరం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త లలితా శివజ్యోతి

ఇందుకూరుపేట: విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలతో పాటు క్షేత్రస్థాయి అధ్యయనం అవసరమని, తద్వారా నాణ్యమైన పంట దిగుబడికి కృషి చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త లలితా శివజ్యోతి అన్నారు. మండలంలోని జగదేవిపేటలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై, మాట్లాడారు. విద్యార్థులు నిత్యం రైతులతో మమేకం కావాలని సూచించారు. అనంతరం రైతులు తమ సందేహాలను విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



శివరామకృష్ణారెడ్డి, సీఐ



శ్రీనివాసులురెడ్డి, బుచ్చి సీఐ



శివరాకేష్, ఎస్సై

పొదలకూరు: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పోలీసుల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పొదలకూరు సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి అన్నారు. పొదలకూరు సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో కేకులు కట్ చేయడం, మద్యం తాగి వాహనాలు నడపడం, సైలెన్సర్లు లేకుండా మోటార్‌బైక్‌లను నడపడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈవ్‌టీజింగ్, బాణసంచా కాల్చడం, ఇతరులకు అసౌకర్యం కలిగేలా ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

– **మనుబోలు:** కొత్త సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణం చేసుకోవాలని, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శివరాకేష్ సోమవారం హెచ్చరించారు.

– **బుచ్చిరెడ్డిపాళెం :** నూతన సంవత్సరం సందర్భంగా యువకులు క్రమశిక్షణతో మెలగాలని బుచ్చిరెడ్డిపాళెం సీఐ పి.శ్రీనివాసులురెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ అందరూ ప్రశాంతంగా ఇళ్ల వద్ద న్యూ ఇయర్ వేడుకలను జరుపుకోవాలని కోరారు.

రమేష్‌రెడ్డి సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం: డాక్టర్ కె.రమేష్‌రెడ్డి సేవలు మరువలేనివని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పేర్కొన్నారు. దివంగత రమేష్‌రెడ్డి జ్ఞాపకార్థం వర్సిటీలో సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఎన్ఎస్ఎస్ కార్యకలాపాల్లో అందించిన విశేష సేవలకు భారత రాష్ట్రపతి నుంచి పురస్కారాన్ని అందుకున్నట్లు వీసీ తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, పలువురు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది రమేష్ రెడ్డి సేవలను కొనియాడారు.

బుచ్చికి చేరుకున్న ప్రచార జాత



బుచ్చిరెడ్డిపాళెం: జనవరిలో కాకినాడలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచార జాత సోమవారం బుచ్చిరెడ్డిపాళెం చేరుకుంది. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బుచ్చి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణమోహన్, ఎస్.హజరత్‌బాబు, కార్యకర్తలు వారికి స్వాగతం పలికారు. స్థానిక పార్క్ సెంటర్‌లో యూటీఎఫ్ పతాకాన్ని ఎగురవేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



రహ్మద్‌బాషాకు ప్రథమ చికిత్స చేసిన వైద్యులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రహ్మద్‌బాషా అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన రహ్మద్‌బాషా నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో ఉంటున్నాడు. టైల్స్ పనిచేసే రహ్మద్‌బాషా ప్రతిరోజూ బుచ్చిరెడ్డిపాళెం వచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలో అతను బైక్‌పై నెల్లూరు వెళ్తున్న సమయంలో పల్లెవెలుగు ఆర్టీసీ బస్సును వేగంగా ఢీకొని పడిపోయాడు. అదే సమయంలో బుచ్చిరెడ్డిపాళెం నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కూరగాయల వ్యాన్ రహ్మద్‌బాషా కాళ్లమీద నుంచి వెళ్లడంతో తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు 108 ద్వారా అతన్ని బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.

మండల సమావేశం నేడు

ఇందుకూరుపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంధళ్ల శంకరయ్య అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ నాగేంద్రబాబు సోమవారం తెలిపారు. అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

పొదలకూరు: మండలంలోని వావింటపర్తి గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని వినతిపత్రాలను పరిశీలించారు. రైతుల నుంచి ఆరు వినతులు అందాయి. తహసీల్దార్ బి.శివకృష్ణ, ఎంపీడీఓ డీవీ నరసింహారావు, సర్వేయర్ గోపీనాథ్, వీఆర్వో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ గ్రామంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై శనివారం మధ్యాహ్నం దాడి చేసిన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం మేరకు.. జొన్నవాడ గ్రామానికి చెందిన జల్లి లక్ష్మయ్య శనివారం ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు కందికట్టు కృష్ణయ్య, పెంచలయ్య, కుశ్వంత్, లక్ష్మయ్య దౌర్జన్యంగా ఇంట్లోకి చొరబడి దాడి చేశారు. ఇరుగు పొరుగువారు గమనించి దాడి చేసిన వారిని ప్రశ్నించగా వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై దౌర్జన్యం, దాడి చేశారని వాపోయాడు. ఇంట్లో మహిళలు ఉన్నారని వేడుకున్నా విచక్షణారహితంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎంపీడీఓపై దాడి హేయం

ఇందుకూరుపేట: అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై దాడి హేయమైన చర్య అని ఎంపీడీఓ నాగేంద్రబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని కోరారు.

కట్టుబడిపాళెంలో కంటి వైద్య శిబిరం



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని కట్టుబడిపాళెంలో వాసన్ ఐ కేర్ వారిచే నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ సోమవారం ప్రారంభించారు. ప్రసాద్, కౌన్సిలర్ నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు పలువురికి కంటి పరీక్షలు చేశారు.

దొరువులపాళెంలో సదస్సు నేడు

ముత్తుకూరు: మండలంలోని దొరువులపాళెం సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికులు, రైతులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

ఆవిష్కరణల వేదిక.. వైజ్ఞానిక ప్రదర్శన



ముత్తుకూరు: నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ



వెంకటాచలం: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ తదితరులు

ముత్తుకూరు: ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో సోమవారం సదరన్ ఇండియా మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన – 2024ను ఎంఈఓ మధుసూదన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అబ్బురపరిచే సైన్స్ నమూనాలను ప్రదర్శించారని కొనియాడారు. స్థానిక సమస్యలను, వాటి ఫలితాలను కూడా అందుబాటులో దొరికిన సామగ్రి ద్వారా కళ్లకు కట్టినట్టు చూపించారని అభినందించారు. మండలంలోని ఆరు జెడ్పీ హైస్కూళ్లు, ఒక గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

- **వెంకటాచలం:** మండలంలోని వెంకటాచలంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ జరిగింది. అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. వ్యక్తిగత కేటగిరీలో జి.తేజస్విని (9వ తరగతి), గ్రూప్ కేటగిరీలో ఎస్కే కరిష్మా (9వ తరగతి), సీహెచ్ దీక్ష (9వ తరగతి), టీచర్ కేటగిరీలో పి.అమరావతి ప్రతిభ చూపారు. మూడు కేటగిరీల్లో గొలగమూడిలోని ఆశ్రమ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వారే ప్రతిభ చూపడం విశేషం. ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలను వి.శ్రీనివాసులురెడ్డి అభినందించారు.

సొసైటీ ద్వారా ఎరువుల పంపిణీ



గోదాములో ఎరువుల నిల్వలు

పొదలకూరు: మండల సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు ఎరువులను పంపిణీ చేస్తున్నామని సొసైటీ సీఈఓ రాధాకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొచ్చి ఎరువులను ఎమ్మార్పీకే తీసుకోవచ్చన్నారు. ప్రస్తుతం యూరియా, 20:20:0:13 మాత్రమే అందుబాటులో ఉన్నట్టు వెల్లడించారు. యూరియా 45 టన్నులు, 20:20:0:13 ఎరువులు 8 టన్నులు స్టాక్ ఉందన్నారు. పది ఎకరాలున్న రైతుకు 10 బస్తాల యూరియాను మాత్రమే అందజేస్తామన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందన



వలంటీర్లను అభినందించిన ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో ఉన్న లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఈనెల 21 నుంచి 27 తేదీ వరకు జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) నుంచి ఎనిమిది మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. ఈ బృందానికి విడవలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఐ.సునీల్ ప్రాతినిధ్యం వహించారు. 17 రాష్ట్రాల నుంచి వలంటీర్లు పాల్గొన్న ఈ శిబిరంలో వీఎస్‌యూకు చెందిన వారు ప్రత్యేకతను చాటుకున్నారు. పోస్టర్ పెయింటింగ్‌లో శాలిని తృతీయ స్థానం సాధించారు. వలంటీర్లు, ప్రోగ్రాం అధికారి ఐ.సునీల్‌ను ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు సోమవారం అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బి.సాయినాథ్, డాక్టర్ బి.వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో 'సాగు'



వరి పొలంలో డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ

మనుబోలు: వ్యవసాయంలో చాలా మార్పులు వచ్చాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే వరికోత, గడ్డి చుట్టే యంత్రాలను విరివిగా వినియోగిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు డ్రోన్లతో పురుగు మందు పిచికారీ చేయించడం చాలాచోట్ల మొదలైంది. ఈ ఏడాది కూలీలకు బాగా డిమాండ్ ఉండటంతో మనుబోలుకు చెందిన రైతు నల్లిబోయిన రామచంద్రయ్య తాను సాగు చేస్తున్న పొలంలో డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేయించాడు. దీంతో ఖర్చులు తగ్గడంతోపాటు సమయం కూడా ఆదా అవుతుందని చెబుతున్నాడు. రామచంద్రయ్యను చూసి పలువురు రైతులు డ్రోన్ సాయంతో పురుగు మందు పిచికారీ చేయించేందుకు ఉత్సాహం చూపుతున్నారు.